## స్టేషన్ దగ్గిర రిక్షా ఆగింది.

రిక్షా దిగుతూనే టైం చూశాడు కేశవరావు. ఉదయం ఎనిమిది గంటలు దాటి పది నిమిషాలయింది. ట్రెయిన్ రావడానికి ఎక్కువ టైం లేదు. రిక్షావాలాకి డబ్బిచ్చి చప్పన బుకింగ్ ఆఫీసు దగ్గరికి చేరాడు. అమ్మయ్య! ఎక్కువ రద్దీ లేదు. క్యూలో నలుగురైదుగురే వున్నారు. కేశవరావు క్యూలో నిలబడి ముఖం తుడుచుకొన్నాడు. ట్రెయిన్ రైట్ టైమో, లేటో!

తన వంతు వచ్చేసింది.

"బాపట్ల" ఇరవై రూపాయల నోటు ఇస్తూ అన్నాడు.

బుకింగ్ క్లర్క్ టికెట్టూ, చిల్లరా కౌంటర్లో పడేశాడు. అవి జేబులో వేసుకొని వస్తుంటే ఓ కుంటి వాడు చెయ్యి చాపాడు. వెళ్ళేది శుభకార్యం కోసం గదా అని అతని చేతిలో ఓ పావలా పడేశాడు కేశవరావు.

"చేసిన ధర్మం చెడని పదార్థం" అని రాగం తీస్తూ అతను పక్కకి వెళ్ళాడు.

కేశవరావు నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం మీదికొచ్చాడు. రైళ్ళ రాకపోకల బోర్డు చూశాడు.

తిరుపతి వెళ్ళే హౌరా ఎక్స్‌ప్రెస్ అరగంట లేటు.

నయం, అరగంటే.

కేశవరావు అటూ ఇటూ చూసి ఓ బెంచీ దగ్గరికి చేరాడు. అదివరకే ఆ బెంచీమీద కూర్చున్న వ్యక్తి పక్కన వున్న బ్రీఫ్‌కేస్ దగ్గరికి లాక్కుంటూ "కూర్చోండి" అన్నాడు. కేశవరావు బెంచీమీద చేరగిలబడ్డాడు. ఆ వ్యక్తి అతన్ని నఖశిఖ పర్యంతం చూశాడు.

"హౌరా ఎక్స్‌ప్రెస్‌కి వెడతారా?"

"అవునండి."

"అరగంట లేటుట"

"అవును, చూశాను."

"ఏం రైళ్ళో, లేటు కాకుండా రావు కదా."

"అవి లేటని మనం లేటుగా రావడానికి వీల్లేదు కదా. ఇలా పడిగాపులు పడాలిసిందే. వాటి దయ!"

"ఇంకా ఎక్కువ లేటు కాకపోతే అదే చాలు."

"అంతేమరి. అరగంటేనో, మళ్ళీ ఇంకో అరగంటో –"


"ఎందాకా వెడుతున్నారు?"

"బాపట్ల. మీరూ?"

"బాపట్లేనండి."

# దీపం నీడ

హితశ్రీ



"పని చూసుకుని తిరిగి కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కి తిరిగిరావాలనుకొంటున్నాను. ఈ రైలెప్పటికి వచ్చి ఏడుస్తుందో."

"అది మాత్రం లేటుకాకుండా వుంటుందా?" కేశవరావు నవ్వాడు.

"మనకి కావలసినప్పుడు లేటుగా రావండోయ్."

"నిజమే. బాపట్లలో బంధువులున్నారా?"

"లేరండి. మా అమ్మాయికి పెళ్ళి సంబంధం చూడటానికి వెడుతున్నాను."

"అలాగా. మంచి సంబంధమేనా?"

"మంచిదే. కాని కుదరొద్దూ?"

"కుదరకేం చేస్తుందిలెండి."

"అమ్మాయి చక్కని చుక్క. బి.ఏ. చదువుతోంది. భక్తిశ్రద్ధలున్నాయి. మంచి సంప్రదాయమే. కాని ఈ రోజుల్లో ఇవన్నీ ఎవరిక్కావాలండీ? కావలసింది డబ్బు. అంతే."

"అంతా అలా వుండరులెండి."

"ఏమో" అని పెదవి విరిచాడు కేశవరావు.

"పెళ్ళిళ్లు స్వర్గంలో నిర్ణయమవుతాయని సామెత."

"జరిగేది ఇక్కడే కదా. వాళ్ళు పెద్ద ఎత్తునే వున్నారని విన్నాను."

"మీ శక్తికి మించిందా?"

"నా శక్తేముందిలెండి. ఉండేది ఏడెనిమిది ఎకరాల కొండ్ర. ఇంకా పిల్లలున్నారు."

"మీరేం చేస్తుంటారు.?"

"వ్యవసాయం. పక్క ఊళ్ళోనే పొలం. పిల్లల చదువుకోసం ఇక్కడ కాపురం వుంటున్నాం."

"ఇక్కడ సొంత ఇల్లుందా?"

"ఉంది. తండ్రి తాతలనాటిది. అందువల్ల కూడా ఈ ఊరొదిలి వెళ్ళలేక ఇక్కడే వుంటున్నాం మొదట్నించీ. పల్లెటూళ్ళో వుంటే కొంచెం ఖర్చు కలిసొచ్చేదేమో."

"వేడినీళ్ళకి చన్నీళ్ళు తోడన్నట్టు, ఏదైనా వ్యాపారం కూడా చేస్తే బావుండేది కదండీ."

"వ్యాపారం అంటే మాటలా? అది అందరికీ సాధ్యం కాదండీ. కాలం ఖర్మం కలిసిరాక కాని, నేను మంచి ఉద్యోగం చెయ్యాలిసిన వాడిని కదండీ అసలు."

"అలాగా?" కుతూహలంగా అన్నాడు ఆ వ్యక్తి.

"బి.కాం. మంచి మార్కులతో పాసయానండి. ఆ రోజుల్లో బాంక్ ఉద్యోగం మీద మహా మనసుగా వుండేది. దొరుకుతుందని చాలా ఆశపడ్డానండి."

"గట్టి ప్రయత్నం చేశారా?"

"కాస్తా కూస్తా ప్రయత్నమా? అయిదువేలు ధారపోశానండీ" విచారంగా అన్నాడు కేశవరావు.

"అయిదువేలా?" ఆశ్చర్యంగా చప్పున తలెత్తి కేశవరావు వైపు చూశాడు ఆ వ్యక్తి.

"అవునండి. దగుల్బాజీ. ఎన్నెన్నో మాటలు

## అవ్యక్తం!



పుట్టకముందు చూశా
అర్థంకాలేదు ప్రపంచం
పుట్టాక చూశా—
ప్రపంచానికి
నేనర్థం కాలేదు—
పోయాకా చూశా
ఎవరికి యెవరమూ
అర్థం కాలేదు—

—చిమ్మపూడి శ్రీరామమూర్తి

చెప్పాడు. పేరు గుర్తులేదు. ఎంతమందికో బాంక్ ఉద్యోగాలు ఇప్పించానన్నాడు. కేవలం పరోపకారం కోసమే బతుకుతున్నట్టు నమ్మించాడు. ఎవరో డైరెక్టర్‌కి సన్నిహితుడినన్నాడు. అయిదువేలు అతనికిస్తే ఉద్యోగం ఖాయం అన్నాడు. తెలివితక్కువగా అతని మాటలు నమ్మాను. అయిదువేలూ తీసుకుని వెళ్ళాడు. మళ్ళీ కనిపించలేదు."

ఆ వ్యక్తి అలాగే కేశవరావు వైపు చూడసాగాడు.

"అయ్యో!" జాలిపడుతూ అన్నాడు.

"దాంతో నాకు ఉద్యోగం మీద విరక్తికలిగింది. ఉన్న పొలం చూసుకుంటే చాలనుకొని వ్యవసాయంలోకి దిగాను. చూశారా, ఆ మోసగాడు నా జీవితంమీద ఎంత దెబ్బతీశాడో."

"అవునండి. మంచివాళ్ళున్న చోటే మోసగాళ్ళూ వుంటారు. మీ బంగారు భవిష్యత్తు అతనికి అర్పణం అయింది. అదృష్టం అతన్ని వరిస్తే దురదృష్టం మిమ్మల్ని వంచించింది" అన్నాడు ఆ వ్యక్తి బాధగా.

"చాలా ఘోరంగా వంచించింది."

"బాధపడకండి సార్. అన్నట్టు మీ పేరు —"

"కేశవరావు. నాజర్‌పేటలో వుంటాం."

"అహా — ఇది జరిగి ఎన్నాళ్ళయి వుంటుంది కేశవరావుగారూ."

"ఇరవై ఏళ్ళయినా అయి వుంటుంది."

"కొన్ని సంఘటనలు జీవితాల్నే మార్చేస్తాయండి. అయితే, మంచికి చెడూ, చెడుకి మంచీ ఎప్పుడూ నీడలు పడుతూనే వుంటాయండి. మీ వల్ల అతనెవరో లాభం పొందాడు. కాని ఆ లాభానికి మీకు అతని దగ్గర్నించి అయినా కాకపోయినా ఏదో విధంగా ప్రతిఫలం ముడుతుందని నాకనిపిస్తోందండి. బహుశా మీ అమ్మాయికి చాలా తక్కువ కట్నంతోనో, కట్నం అసలు లేకుండానో పెళ్ళి నిశ్చయం కావొచ్చు" అన్నాడతను ఓదార్పుగా.

"మీనోటి వాక్యాన అలాగే జరిగితే ఇంకేం కావాలి. ఇంతకీ మిమ్మల్ని గురించి ఏం అడగలేదు. మీరేం చేస్తుంటారు?"

"బిజినెస్. ఏవేవో చాలా వ్యాపారాలున్నాయి. హోల్‌సేల్."

"అలాగా, మీ పేరు—?"

ఆ వ్యక్తి వినిపించుకోకుండా అటువైపుగా వస్తున్న పోర్టర్‌ని కేకపెట్టి పిలిచాడు.

"ఇదిగో పోర్టర్, గౌరా ఎక్స్‌ప్రెస్ అరగంటేనా లేటు, ఇంకా ఏమైనా — "

"నలభై అయిదు నిమిషాలు లేటు బాబూ."


"సరే. అలా లేటు పెరిగిపోతూనే వుంటుంది. బాగానేవుంది" అన్నాడు ఆ వ్యక్తి విసుగ్గా.

కేశవరావుకి మరీ విసుగుపుట్టింది.

"అలా, బుక్‌స్టాల్‌కి వెళ్ళి ఏదైనా పత్రిక కొనుక్కొస్తాను. కాస్త కాలక్షేపం అవుతుంది."

"ఆ — వెళ్ళిరండి."

కేశవరావు బుక్‌స్టాల్ వైపు నడిచాడు. బుక్‌స్టాల్ తెరిచే వుంది. అక్కడ వున్న పత్రికలు చూస్తూ కాసేపు నిలబడ్డాడు. చివరికి ఓ వార్తా పత్రిక



మాత్రం కొని శీర్షికలు చూస్తూ ఇంతకిముందు కూర్చున్న బెంచీ దగ్గరకి వచ్చాడు.

"ఏ రోజు పత్రిక చూసినా అన్నీ హత్యలూ, దోపిడీల వార్తలే" అన్నాడు బెంచీమీద కూర్చుంటూ.

తెరిచిన బ్రీఫ్‌కేస్ ఒళ్ళో పెట్టుకొని అప్పడే మూసివేస్తున్న ఆ వ్యక్తి కొంచెం వులిక్కిపడి కేశవరావువైపు చూసి బ్రీఫ్‌కేస్ పక్కన పెట్టాడు.

"లేకపోతే బస్సు ప్రమాదాలూ, రోడ్డు ప్రమాదాలూ, రైలు ప్రమాదాలూ –"

"బంద్‌లు సరేసరి."

"బాగా చెప్పారు. ఇంకా ట్రెయిన్ పటానికి చాలా టైముంది. అలా వెళ్ళి కాస్త కాఫీ తాగివద్దామా?" అన్నాడా వ్యక్తి.

"నాకు కాఫీ అలవాటు లేదండి. మీరు వెళ్ళి రండి" అన్నాడు కేశవరావు పేపరు తిరగేస్తూ.

"సరే. కాస్త బ్రీఫ్‌కేస్ చూస్తూ వుంటారు కదూ. త్వరలో వచ్చేస్తా" అన్నాడా వ్యక్తి లేస్తూ.

"అలాగే" కేశవరావు బ్రీఫ్‌కేస్ తన దగ్గిరికి లాక్కుంటూ తలాడించాడు.

ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. కేశవరావు ఆసక్తికరంగా పేపర్ వార్తలు చూస్తున్నాడు.

మరికొన్ని నిమిషాల్లో హౌరా ఎక్స్‌ప్రెస్ నాలుగో నంబరు ప్లాట్‌ఫారం మీదికి వస్తుందని లౌడ్‌స్పీకర్‌లో ప్రకటన. కేశవరావు అమ్మయ్య అనుకొన్నాడు. పేపర్ మడిచి తలెత్తి పక్కన చూశాడు. ఇంకా ఈయన రాలేదేమిటి అనుకొన్నాడు.

మరి కొన్ని క్షణాలు గడిచాయి.

అతను ఇంకా రాలేదు.

కేశవరావు ప్లాట్‌ఫారం నలుదిక్కులా చూశాడు. అతనెక్కడా కనిపించలేదు.

కేశవరావు విసుక్కొన్నాడు. ఏమిటి ఇంత నిర్లక్ష్యం.

గంట మోగింది.

కేశవరావు ముఖం చిట్లించాడు.

ఏమిటి ఇతని అభిప్రాయం? చివరి నిమిషందాకా ఎక్కడో పచార్లు కొట్టి తీరా ట్రెయిన్ వచ్చేసరికి గాభరాగా పరుగుతీసే మనుషుల్ని చూస్తే కేశవరావుకి చిరాకు.

అయినా తన నెత్తిన ఈ బ్రీఫ్‌కేస్ పడేసి ఆ షికార్లేమిటి? ఎవరి సామాను వారు చూసుకోవాలిగాని ఇతర్ల నెత్తిన రుద్దటమేమిటి!

ఊహూ – ఇంకా రావడంలేదు.

రైలు వస్తోంది. పోర్టర్లు సామాన్లు ఎత్తుకొంటున్నారు. జనం సామాన్లు చేతుల్లోకి తీసుకొని గబగబ అడుగులు వేస్తున్నారు.

అతను రాలేదు.

కేశవరావుకి ఏం చెయ్యాలో తోచటం లేదు. తటాలున అతనికో అనుమానం వేసింది. ఈ బ్రీఫ్‌కేస్‌లో ఏముందో!

అతను కావాలని ఆ బ్రీఫ్‌కేస్‌ని తనకి అంటగట్టలేదు గదా? ఎందుకలా చేస్తాడు. ఒకవేళ అందులో ఏ దొంగ సామ్మో, దొంగ రవాణా సరుకో లేదు కదా!

కేశవరావుకి కొంచెం గాభరావేసింది. ఎవరో పోలీస్ కానిస్టేబిల్ తనవైపే వస్తున్నాడు. కేశవరావుకి ముచ్చెమటలు పోశాయి. ఇది తప్పక స్మగ్లింగ్ కేసే. అతను ఏదో పసికట్టి తనమీదికి నెట్టేసి తప్పుకొన్నాడు. కేశవరావు ముఖం జేవురించింది. స్కాండల్.

కానిస్టేబుల్ కేశవరావువైపు చూశాడు.

కేశవరావు తొట్రుపాటుతో లేచి నిలబడ్డాడు.

కానిస్టేబుల్ ముందుకి వెళ్ళిపోయాడు.

కేశవరావు గుండె కుదటపడ్డది. స్మగ్లింగ్ కేస్ కాదనుకొన్నాడు. మరి అతనెందుకు రాలేదు? ఏదైనా అనుకోకుండా ఇబ్బంది కలిగిందా? కాఫీ తాగుతూ ఎవరితోనో మాట్లాడుతూ పరధ్యానంగా వున్నాడా? ఇప్పడు తనేం చెయ్యాలి. అలా బ్రీఫ్‌కేస్ వదిలేసిపోతే!

పాపం, అతను వచ్చి వప్పగిస్తే తను బాధ్యతారహితంగా ఎలా ప్రవర్తించగలడు? అతనూ బాపట్లే కదా! చివరి నిమిషంలో రైలెక్కినా బాపట్లలో దిగగానే తనని వెతుక్కుంటూ వస్తాడు. ఆ




ఉబ్బసం వ్యాధికి ప్రత్యేక చికిత్స! నూతన యవ్వనం పొందండి!
సంతానవంతులు కండి!! చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి!!!

హస్తప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, దాంపత్య సుఖం లేకపోవుట, సంతానము లేకపోవుట, సొరియాసిస్, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిపుండ్లు, సుఖ సంబంధమైన వ్యాధులు, ఫెస్టులా స్త్రీల కుసుమ వ్యాధులకు, చర్మవ్యాధులకు, లైంగిక సమస్యలకు చికిత్స చేయబడును. పోస్టు ద్వారా కూడా చికిత్స కలదు.

క్యాంపులు:

ప్రతి నెల 1, 16 తేదీలలో రాజమండ్రి, హోటల్ అశోకా, కోటగుమ్మం వద్ద.
ప్రతి నెల 2, 17 తేదీలలో కాకినాడ, వీనస్ ఎ.సి. లాడ్జి, కల్పనా టాకీస్ వద్ద.
ప్రతి నెల 6, 21 తేదీలలో భీమవరం, షణ్ముఖ లాడ్జి.
ప్రతి నెల 9వ తేదీన ఒంగోలు, హోటల్ పూర్ణిమ, బస్టాండ్ వద్ద.
ప్రతి నెల 10వ తేదీన నెల్లూరు, హోటల్ చిప్పీ ఇంటర్నేషనల్, గాంధీ బొమ్మ సెంటర్
ప్రతి నెల 25వ తేదీన ఖమ్మం, హోటల్ కిన్నెర ఎ.సి., బస్టాండు వద్ద.
ప్రతి నెల 26వ తేదీన కొత్తగూడెం, హోటల్ లేపాక్షి.
ప్రతి క్యాంపులోనూ ఉ. గం.10–00 నుండి రాత్రి గం.10–00 వరకు.
పై క్యాంపు తేదీలు మినహా మిగిలిన రోజుల్లో డాక్టరుగారు గుడివాడ క్లినిక్‌లో వుంటారు.

40 సం.ల గొప్ప అనుభవంగల ఆయుర్వేద అలంకార
డా. డి.మార్కండేయులు సెక్స్ & స్కిన్ వ్యాధులకు అనువంశిక ఆయుర్వేద నిపుణులు
పార్కు రోడ్, గుడివాడ–1. ఫోన్స్: 2522 & 2540

SHAH ADS.

ధీమాతోనే ఇంతదాకా ఆగాడేమో! ఏమైనా తను అతని సొమ్ము అతనికి అందచేయాలి. ఒకవేళ అతను బాపట్లలో కూడా కనిపించకపోతే? కేశవరావుకి ఏం చెయ్యటానికీ తోచటం లేదు. రైలు వచ్చేస్తోంది.

తర్వాత ఏం చేయాలో ఆలోచించుకోవచ్చనుకొని కేశవరావు బ్రీఫ్‌కేస్ అందుకుని చవ్వన రైలెక్కాడు. రైలెక్కినా డోర్ దగ్గర నిలబడి ప్లాట్‌ఫారం అంతా కలయచూశాడు.

అతనెక్కడా జాడలేదు.

రైలు కదిలింది.

కేశవరావుకి ఏమీ అంతుపట్టడంలేదు. అతనెందుకిలా చేశాడు? మంచివాడులాగే కనిపించాడు? బాగా మాట్లాడాడు. అతనికేం జరిగిందో?

బాపట్ల వచ్చింది:

రైలు దిగి అతని కోసం చూశాడు. లేదు. అతను రైలెక్కలేదన్నమాట! విచిత్రంగా వుంది.

చేసేదేం లేక కేశవరావు స్టేషన్ బయటికి వచ్చాడు. పెళ్ళి సంబంధం వాళ్ళని కలుసుకొన్నాడు. వాళ్ళు చాలా మర్యాదగా మాట్లాడారు. అమ్మాయిని చూడటానికి ఏ రోజున వచ్చేదీ త్వరలోనే ఉత్తరం రాసి తెలియచేస్తామన్నారు.

కేశవరావుకి సంతృప్తిగా వుంది. భగవంతుడి దయవల్ల ఈ సంబంధం కుదరవచ్చేమో! సంతోషంగా అతను రైల్వేస్టేషన్‌కి చేరుకున్నాడు. కృష్ణా ఎక్స్‌ప్రెస్ టైంకే వచ్చింది. ఉత్సాహంగా తెనాలి చేరుకున్నాడు. రైలు దిగగానే బ్రీఫ్‌కేస్ సమస్య ఎదురైంది. ఏం చెయ్యాలి? ఇందులో ఏ బాంబులో లేవుగదా? ఏమో? అతనెవరో, పేరేమిటో, ఊరేమిటో కూడా తెలియదు. బ్రీఫ్‌కేస్ తెరిచి చూస్తే? తాళం పగలకొట్టాలి. తనాపని చెయ్యవచ్చా? అడ్రస్ అందులో వుండొచ్చు. ఉంటే అతనికి ఉత్తరం రాయవచ్చు. ఉత్తరం అందుకుని అతను తన ఇంటికివచ్చి బ్రీఫ్‌కేస్ తీసుకువెడతాడు. బాగుందనుకున్నాడు. కాని ధైర్యం చాలలేదు. తనకెందుకు వచ్చిన బెడద! పోలీస్ స్టేషన్లో వప్పగిస్తే సరి! ఈ ఆలోచన అతనికి నచ్చింది.

పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు. సబ్‌ఇన్‌స్పెక్టర్ లేడు. రైటర్‌కి బ్రీఫ్‌కేస్ అందచేశాడు. స్టేట్‌మెంట్ ఇచ్చాడు. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నాడు. ఉల్లాసంగా ఇంటికి వెళ్ళాడు.

ఇంటిదగ్గిర కాసేపు విశ్రాంతి తీసుకున్నాడో లేదో "కేశవరావుగారూ, కేశవరావుగారూ" అని ఎవరో పిలవటం వినిపించింది. తలుపు తీశాడు. ఎదురుగా పోలీస్ కానిస్టేబుల్.

"సార్ తమరేనా కేశవరావుగారు?"

"అవును. ఏం పని?"

"ఎస్.ఐ.గారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు సార్."

"ఎందుకు?"

"పొద్దున మీరో బ్రీఫ్‌కేస స్టేషన్లో హాండోవర్ చేశారట గదా. ఆ విషయం గురించండి."

కేశవరావుకి గుండె దడదడలాడింది. ఇదేదో పోలీస్ కేసే. అనవసరంగా ఇరుక్కున్నాడు. ఇందులోంచి ఎలా బయటపడాలో ఏమో?

కేశవరావు కాళ్ళీడ్చుకొంటూ స్టేషన్‌కి వెళ్ళాడు.

"నమస్తే"

"కూర్చోండి సార్ మీరేనా కేశవరావుగారు?" ఎస్.ఐ. అన్నాడు.

"అవునండి."

"ఇందాక మీరో బ్రీఫ్‌కేస్ మాకు హాండోవర్ చేశారట కదా! ఇదేనా?"

"అవునండి" అన్నాడు కేశవరావు బ్రీఫ్‌కేస్ గుర్తుపట్టి.

"ఇందులో ఏముందో మీకు తెలుసా?"

"తెలీదండి. దాంతో నాకసలు ఏ సంబంధమూ లేదండి. ప్లాట్‌ఫారం బెంచీమీద నా పక్కన కూర్చున్న వ్యక్తి కాఫీ తాగి వస్తాననీ, బ్రీఫ్‌కేస చూస్తుండమనీ చెప్పి వెళ్ళాడండి. అతనెవరో, ఏమిటో నాకేం తెలీదు. అతనెంతకీ రాకపోయేసరికి మీ స్టేషన్లో ఇది హాండోవర్ చేశానండి" అన్నాడు భయంభయంగా.

"ఇది పగలకొట్టి చూశాం. అందులో ఈ ఉత్తరం వుంది. దీనిమీద మీ అడ్రస్ రాసి వుంది. చూడండి" ఎస్.ఐ. ఉత్తరం కేశవరావు చేతికిచ్చాడు. అతను ఆతృతగా ఉత్తరం అందుకొని చదవసాగాడు.

"ప్రియమైన కేశవరావుగారూ,

నమస్తే. మోసంతో మీ దగ్గిర ఇరవైఏళ్ళ క్రితం అయిదువేలు తీసుకున్న వ్యక్తిని నేనే. వయసు తెచ్చిన మార్పువల్ల మీరు నన్ను గుర్తుపట్టలేకపోయారు. ఆ రోజు గత్యంతరం లేక అలా చేశాను. దాంతో నేను వ్యాపారం ప్రారంభించాను. అదృష్టం నన్ను వరించింది. అనేక వ్యాపారాల్లో లక్షలు గడించాను. ఎన్నోసార్లు మిమ్మల్ని కలుసుకొని క్షమాపణ కోరాలనుకొన్నాను. ధైర్యం లేకపోయింది. మీ ఋణం ఎన్నడూ ఏ విధంగానూ తీర్చలేను. మిమ్మల్ని ఇవాళ నాటకీయంగా కలుసుకున్నాను. అమ్మాయి పెళ్ళి సందర్భంగా ఈ చిరుకానుక స్వీకరించండి. క్షమించకోరుతూ

మీ

ఋణగ్రస్తుడు

ఉత్తరం చదవటం ముగించి, తేలికపడ్డ మనసుతో కేశవరావు ఎస్.ఐ. వైపు చూశాడు.

ఎస్.ఐ. మందహాసం చేశాడు.

"ఉత్తరం ప్రకారం ఈ బ్రీఫ్‌కేసూ, ఇందులో వున్న మొత్తమూ మీకే చెందుతాయి. లెక్కపెట్టుకోండి'' ఎస్.ఐ. బ్రీఫ్‌కేస్ తెరిచి కేశవరావుకి చూపించాడు.

కేశవరావు అప్రతిభుడయాడు. అందులో వంద రూపాయల నోట్ల కట్టలు పది వున్నాయి. ఆశ్చర్యంగా ఎస్.ఐ. వైపు చూశాడు.

"ఏమిటలా చూస్తారు?" అన్నాడు ఎస్.ఐ.

"ఆశ్చర్యంగా వుంది."

"ఆశ్చర్యమేముంది? మార్కెట్ రేట్ల ప్రకారం కాంపౌండ్ వడ్డీతో చెల్లించాడు. ఆ రోజుల్లో అయిదువేలంటే మాటలా? అంత సొమ్ము అనాలోచితంగా ఎలా మోసపోయి ఇచ్చారండీ. సరే. అదంతా మాకెందుకు, ఈ రిజిష్టర్‌లో సంతకం పెట్టండి" ఎస్.ఐ. రిజిష్టర్ చూపించాడు. కేశవరావు సంతకం చేశాడు. బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు. ఎస్.ఐ. దగ్గర సెలవు తీసుకున్నాడు. పోలీసు స్టేషన్ బయటికి వచ్చాడు. అతనికి నమ్మశక్యం కావటంలేదు. పేరు తెలీని ఆ వ్యక్తికి అనేక వేల నమస్కారాలు చేశాడు. ఎంత నిజాయితీపరుడు! ఆశ్చర్యం. ఆ మాటకొస్తే ఎస్.ఐ. మాత్రం ఎంత నిజాయితీపరుడు. దమ్మిడీ అడగలేదు. అందులో వాళ్ళు సగం కొట్టేస్తే తనేం చెయ్యగలిగేవాడు? అసలు పూర్తిగా కొట్టేస్తే మాత్రం చేసేదేముంది? చటుక్కున కేశవరావుకో విషయం గుర్తుకి వచ్చింది. ఎంత మొత్తం ఇచ్చిందీ ఉత్తరంలో లేదు. లక్షేనా? లేక రెండు లక్షలిచ్చాడా? రెండు లక్షలిస్తే అందులో ఒక లక్ష – సందేహమేముంది – వాళ్ళు బహుమతి ఏమీ అడగలేదంటే – ఒక లక్ష – కేశవరావు ముఖం మ్లానమయింది. తనెందుకు బ్రీఫ్‌కేస్ పోలీస్ స్టేషన్లో ఇచ్చాడు? తనే ఎందుకు పగలకొట్టి చూడలేదు! అతని ముఖం కళ తగ్గింది. ఓ లక్ష – తప్పకుండా ఓ లక్ష చెయ్యి జారిపోయింది. దురదృష్టం.

●

## మాటలతో బౌలింగ్

తమ సంభాషణా చాతుర్యంతో జనాన్ని నవ్వించగల రాజకీయ నాయకులు ఎందరో వున్నారు. ఈ మధ్య ప్రముఖ క్రికెట్ ఆటగాడు మొహిందర్ అమర్‌నాథ్ భారతీయ జనతాపార్టీలో చేరడం జరిగింది. ప్రముఖ బి.జె.పి. నాయకుడు శ్రీలాల్ క్రిష్ణ అద్వానీ తమ పార్టీ వారికి అమర్‌నాథ్‌ని పరిచయం చేస్తూ...."క్రికెట్‌లో రాజకీయాలు ఎక్కువ అవటం మూలాన్నో.. రాజకీయాలలో క్రీడాస్ఫూర్తి కొరవడడం వల్లనో బహుశా అమర్‌నాథ్ ఈ నిర్ణయం తీసుకుని వుంటాడు.." అన్నారు. అద్వానీ మాటలకు అంతా నవ్వేరట.

సేకరణ: భమిడిపాటి వెంకటేశ్వరరావు